
సాక్షి
నారాయణపేట
గురువారం : 10 : జూలై : 2025



స్వల్పంగా తగ్గిన వరద
జూరాలకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గింది.
వివరాలు 8లో ▸



అర్హులకు దక్కేనా..?
జడ్చర్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5/21.9
వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

ట్రాన్స్‌కో అధికారుల లీలలు

- కాంట్రాక్టర్లతో కుమ్మక్కు
- వెంచర్లలో తమ బినామీలకు పనులు దక్కేలా యజమానులపై ఒత్తిడి
- మాట వినకుంటే 'విద్యుత్' అనుమతుల్లో జాప్యం






కోస్గి సబ్‌స్టేషన్

కోస్గి: విద్యుత్ శాఖలో పని చేస్తున్న కొందరు అధికారులు తమ బినామీలతో విద్యుత్ కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తగా.. మరికొందరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అందినంత దండుకుంటున్నారు. జిల్లా విద్యుత్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు తాము చెప్పిందే వేదం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. డీఈ, ఎస్ఈ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉన్నతాధికారుల కంటే కార్యాలయ బాధ్యతలు నిర్వహించే అధికారులదే హవా కొనసాగుతోంది.

బయటపడిన వ్యవహారం

కోస్గి పట్టణ పరిధిలో నూతనంగా వెలుస్తున్న డీటీసీపీ వెంచర్లలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని యజమానులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఓ వెంచర్ యజమాని విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో నిర్ణీత రుసుం చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. కాగా అధికారులు వెంచర్‌లో విద్యుత్ పనులను తాము సూచించిన వ్యక్తికే అప్పగించాలని అనధికారిక షరతు విధించారు. సదరు కాంట్రాక్టర్‌కు జిల్లా కార్యాలయంలో పలుకుబడి ఉందని, ఇతర కాంట్రాక్టర్లకు పనులు ఇస్తే ఇబ్బంది అవుతుందని పరోక్షంగా హెచ్చరించారు. కానీ వెంచర్ యజమాని వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాడు.



No	Materials Code	Materials Text	Item Catagory	Quantity
1	ABS10002	11KV 200A TT AB SWITCH WITH INSULATORS	Stock item	1
2	HGF10002	11KV HG Fuse Sets with Insulators	Stock item	1
3	FBR10017	11KV Seating Channel set for TT ABSwitch	Stock item	1
4	CBX00004	LT XLPE Cable 1 Core 120 Sq mm	Stock item	30.000
5	BXS00047	LT Distribution Boxes (SMC)	Stock item	1
6	MST00013	MS Channel 75x40 mm	Stock item	30.000
7	MTE30040	LT TVR 100/5A PP 0.5S (CAT-C) DLMS&RDA	Stock item	1
8	DTC30140	3-Ph 25KVA CSP Al Wnd DTR BIS EEL2 Str-2	Stock item	1

ఏఈ ఇచ్చిన నివేదికలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్



No	Materials Code	Materials Text	Item Catagory	Quantity
1	HGF10002	11KV HG Fuse Sets with Insulators	Stock item	
2	FBR10017	11KV Seating Channel set for TT ABSwitch	Stock item	
3	CBX30004	LT XLPE Cable 1 Core 120 Sq mm	Stock item	30.000
4	BXS00047	LT Distribution Boxes (SMC)	Stock item	
5	MTE30040	LT TVR 100/5A PP 0.5S (CAT-C) DLMS&RDA	Stock item	
6	ABS10019	11KV 200A TT Gang Operated AB Switch PPT	Stock item	
7	DTC30129	3-Ph 63KVA CSP Al Wnd DTR BS EEL2 Str-2	Stock item	

జిల్లా అధికారుల మంజూరు పత్రంలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

అంచనా వ్యయం పెంచుతూ..

దరఖాస్తు చేసుకున్న వెంచర్‌లో స్థానిక ఏఈ వెంకటేష్, లైన్‌మెన్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి కావాల్సిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం, ఇతర అంశాల అంచనా వ్యయంతో నివేదికను డీఈకి, అక్కడి నుంచి ఎస్ఈకి పంపిస్తారు. అధికారులు ఏఈలు పంపిన నివేదికలను పరిశీలించి అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కోస్గి ఏఈ స్వయంగా పరిశీలించి 2 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్‌కు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ సరిపోతుందని అధికారికంగా నివేదిక అందజేశారు. కానీ జిల్లా కార్యాలయంలో అనుమతుల వ్యవహారాన్ని పర్యవేక్షించే అధికారి 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని అనుమతులు మంజూరు చేశారు. ఇదే విషయమై డీఈ నర్సింహారావును వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన విద్యుత్ అధికారుల వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.

25 కేవీ సామర్థ్యమే ఎక్కువ

వెంచర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ ఉన్న ప్లాట్లకు 25 కేవీ సామర్థ్యం కూడా ఎక్కువే. అయినప్పటికీ భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొంచెం ఎక్కువగా ఉండాలని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ సిఫారసు చేస్తూ నివేదిక పంపాను. జిల్లా కార్యాలయం నుంచి అంచనా వ్యయం మారుస్తూ 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదు. ఈ విషయం మరోమారు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– వెంకటేష్, ఏఈ, కోస్గి

డీఈ మార్చమంటేనే..

సంబంధిత వెంచర్‌లో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం అని ఏఈ నివేదిక అందజేశారు. కానీ డీఈ సూచించడంతో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచి అనుమతులు మంజూరు చేశాం. దీనిపై అనుమానం ఉంటే డీఈతోనే మాట్లాడండి.

– వెంకట కృష్ణారెడ్డి, ఎస్ఈ కార్యాలయ అధికారి

నెలలుగా కాలయాపన..

విద్యుత్ ఏర్పాటు కోసం ఈ ఏడాది జనవరి 24న దరఖాస్తు చేసుకోగా అధికారులు మాత్రం కాలయాపన చేస్తూ వచ్చారు. తమ బినామీ కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వలేదని ఆగ్రహంతో అధికారులు 6 నెలలుగా ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచారు. ఇదే విషయమై సదరు యజమాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి సిద్ధం కావడంతో పాటు దరఖాస్తు తీసుకున్నట్లు ధ్రువీకరణ అడగడంతో అధికారులు తమదైన శైలిలో విద్యుత్ ఏర్పాటుకు మంజూరు పత్రం అందజేశారు.

ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూం ఇచ్చారా?

నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..

- బీఆర్ఎస్ నాయకులకు మంత్రి వాకిటి సవాల్
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

ఊట్కూర్: మక్తల్ నియోజకవర్గంలో పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. బుధవారం ఊట్కూర్‌లో అడిషనల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత శ్రీహరి మొదటిసారి మండలానికి రావడంతో కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీరాంనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బస్టాండ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరు చెప్పి పేదలను మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటికీ గ్రామాల్లో గతంలో కాంగ్రెస్ పార్టీ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లే దర్శనమిస్తున్నాయని తెలిపారు. శ్రీరాంనగర్ వీధిలో రాత్రి గుండెపోటుతో మృతి చెందిన మేస్త్రీ అశోక్‌కు తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి బాధిత కుటుంబ సభ్యులకు అడిషనల్ కలెక్టర్‌తో కలిసి ప్రొసీడింగ్‌ను అందించారు.

రూ.4,500 కోట్లు మంజూరు

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ.4,500 కోట్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎంత నష్టపరిహారం చెల్లిస్తే స్థానిక రైతులకు కూడా అంతే ఇస్తామని భరోసా నిచ్చారు. ఈ ఎత్తిపోతలతో మండలంలో 36 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మక్తల్–నారాయణపేట రోడ్డు 4 లైన్ల విస్తరణ కోసం రూ.150 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అంతకముందు పెద్దపోర్ల పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శంకర్, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ చింత రవి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూర్యప్రకాశ్‌రెడ్డి, యగ్నేశ్వర్‌రెడ్డి, లింగం, కోరం మహేశ్‌రెడ్డి, మణెమ్మ, బస్వరాజ్ గౌడ్, ఎల్కోటి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

నారాయణపేట: కేంద్ర ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చి పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు మార్చిందని, రాత్రి షిఫ్టులో మహిళలు పనిచేయాలని నిర్ణయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని వాపోయారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, కెంచ నారాయణ, వెంకటయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, కార్మిక సంఘాల నాయకులు

న్యూస్‌రీల్

ఎకరాకు రూ.14 లక్షల పరిహారం



నారాయణపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ సేకరణ చేపట్టి ఎకరానికి రూ.14 లక్షల పరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ రామచందర్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మండలాల్లోని 21 గ్రామాల్లో 562.02 ఎకరాల భూ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూ సేకరణ చట్టం ప్రకారమే రైతుల నుంచి భూమి సేకరిస్తున్నామని తెలిపారు. ఎకరాకు రూ.14 లక్షలు తీసుకునేందుకు రైతులు ఒప్పుకోవడంతో ఆరుగురు రైతుల నుంచి 2 ఎకరాల 11 గుంటల పొలం సేకరించి, అందుకు సంబంధించిన చెక్కులను రైతులకు అందించారు. కడుమూరు సరస్వతికి రూ.4.55లక్షలు, కడుమూరు గోవిందుకు రూ.4.40లక్షలు, వర్కూరు చంద్రయ్యకు రూ.9.80లక్షలు, వర్కూరు రమేష్‌కు రూ.6.30లక్షలు, వర్కూర్ లక్ష్మికి రూ.1.75లక్షలు, బొమ్మలు సూగన్నకు రూ.5.25లక్షల విలువ గల చెక్కులు అందించినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. ప్రాజెక్టుకు భూములు ఇచ్చినందుకు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో మక్తల్ తహసీల్దార్ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

రైతు నమోదు ప్రక్రియలో వేగం పెంచాలి



కోస్గి రూరల్: కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు అందించే ప్రయోజనాలు పొందడానికి తప్పనిసరిగా రైతు నమోదు ప్రకియను వేగంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. బుధవారం తోగాపురంలో చేపట్టిన రైతు నమోదు ప్రకియను ఆయన పరిశీలించారు. కోస్గి మండలంలో 44,506 మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు 10,499 మంది రైతులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. మిగతా రైతులు వేగంగా నమోదు చేసుకునేందుకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ ఇతర ఎరువుల నిల్వలు రైతుల అవసరాలకు సరిపడే విధంగా ఉంచుకోవాలని డీలర్లను ఆదేశించారు. రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రతి అమ్మకానికి రశీదు ఇవ్వాలన్నారు. గడువు తీరిన స్టాక్ ఉండరాదని, నకిలీ ఎరువులు, రసాయన మందులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఓ రామకృష్ణ, ఏఈఓలు వినోద్, అజయ్ ఉన్నారు.

'అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి'



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి రూరల్: స్థానిక మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో 'కడా' ప్రత్యేక అధికారితో కలిసి కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా రూ.305 కోట్లు మంజూరు చేశారన్నారు. వాటితో సీసీ రోడ్లు, వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు, జంక్షన్ల నిర్మాణం, పార్కులు, చెరువుల సుందరీకరణ తదితర పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. గూగుల్ మ్యాప్‌తో పట్టణ స్వరూపం, అండర్ డ్రైయినేజీ నిర్మాణాన్ని మూడు విభాగాలుగా విభజించి చేపడుతున్నామన్నారు. భవిష్యత్‌లో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని మురుగు నీటి నిల్వ కోసం పట్టణ శివారులో మూడు ఎకరాల స్థలం అవసరమని పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్ కలెక్టర్‌ను కోరగా.. ప్రభుత్వ భూమిని చూపించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రూ. 10.50 కోట్లతో చేపట్టే పట్టణ డంపింగ్ యార్డుకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు, జంక్షన్ల పనుల్లో వేగం పెంచాలన్నారు. రూ.37 కోట్లతో చేపట్టే అప్రోచ్ రోడ్లు, మేజర్ లింక్ రోడ్లు, సీసీ, డ్రైయినేజీల టెండర్లు పూర్తయిన వాటిని గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

కాంప్లెక్స్ భవన నిర్మాణాల వేగం

రూ. 8.80 కోట్లతో గుండుమాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి పక్కన చేపడుతున్న మండల కాంప్లెక్స్ భవన నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గుండుమాల్ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన అప్పాయపల్లిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. 129 ఇళ్లు మంజూరు కాగా 40 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు, భాస్కరస్వామి, ఎంపీడీఓ శ్రీధర్, వేణుగోపాల్, పీఆర్‌డీఈ విలోక్, మేనేజర్ అనిల్‌కుమార్, ఏఈ జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

చిన్నారుల్లో పోషకాహార లోపం

- వెల్లడించిన జాతీయ ఆరోగ్య శాఖ
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వే
- జిల్లావ్యాప్తంగా 3 ఐసీడీఎస్ ప్రాజెక్టులు

మక్తల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు పెట్టి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నా చిన్నారుల్లో పోషక లోపం, పెరుగుదల మందగించినట్లు జాతీయ ఆరోగ్య సర్వేల్లో తేలింది. దీంతో మక్తల్, మద్దూర్, నారాయణపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో చిన్నారుల్లో పోషకాహార లోపం నివారించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువును కొలిచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో పోషకాహార లోపం ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు ప్రత్యేక కార్డులు ఇవ్వనున్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో నెలకొకసారి స్త్రీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులు సమావేశమై చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ వివరాలపై చర్చిస్తున్నారు. అతి తక్కువ బరువు ఉన్న చిన్నారులను ఆస్పత్రుల్లో ఉన్న పోషణ సలహా కేంద్రాలకు పంపించి, వారికి అవసరమైన మందులు అందిస్తున్నారు.

704 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వాటిలో మేజర్ అంగన్‌వాడీలు 649 కాగా మినీ కేంద్రాలు 55 ఉన్నాయి. వాటిలో 639 మంది టీచర్లు, 599 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 33,214, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 27,025 మందికి నిత్యం పోషకాహారం అందిస్తున్నారు. దీంతో పాటు ప్రతి నెలా వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు.



గద్దంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు కొలుస్తున్న సిబ్బంది

చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ చేయిస్తాం

జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్ మానిటరింగ్‌లో భాగంగా చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు చేయిస్తున్నాం. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తాం. పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పోషకలోపం ఉన్న చిన్నారుల వివరాల కార్డును తల్లిదండ్రులకు అందజేస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే పోషకాహారాన్ని చిన్నారులకు క్రమం తప్పకుండా అందిస్తున్నాం.

– సరోజిని మట్ట, సీడీపీఓ మక్తల్ ప్రాజెక్టు

సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాధవి

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్ నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అనస్థీషియా విభాగం హెచ్ఓడీ డాక్టర్ మాధవి కొనసాగుతారని మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ వెల్లడించారు. పదోన్నతులు పూర్తయ్యే వరకు ఆమె కొనసాగుతారని పేర్కొన్నారు.

పీయూ లా కళాశాలకు బీసీఐ అనుమతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న లా కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) అనుమతి లభించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసినట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ రమేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 60 మంది విద్యార్థులతో రెండు సెక్షన్లు, ఎల్ఎల్ఎంలో 20 సీట్లతో 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ లా' ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు బీసీఐ అనుమతి లభించడంపై వీసీ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు



పోలీస్ సిబ్బంది సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

దామరగిద్ద: పోలీసులు విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు ఎస్పీ స్వాగతం పలికారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాల గురించి ఎస్పీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఆదేశించారు. రికార్డులు, పెండింగ్, కోర్టు, దర్యాప్తు కేసులను పరిశీలించారు. నూతన సాంకేతిక వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించి మోసాలకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నారాయణపేట రూరల్: వివిధ కారణాలతో జిల్లాలోని కేజీబీవీలలో ఖాళీ అయిన నాలుగు పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఈఓ గోవిందరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో నిర్వహించిన రాత పరీక్ష ఆధారంగా మెరిట్, రోస్టర్ విధానంలో ఎంపిక చేసిన అభ్యర్థులకు 1:3 నిష్పత్తి ప్రకారం గురువారం ఉదయం 11.30 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ తదితర సర్టిఫికెట్లు, లోకల్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రావాలని సూచించారు. జిల్లాలో సీఆర్‌టీ విభాగంలో గణితం, సాంఘిక, హిందీ, పీజీసీఆర్టీ విభాగంలో భౌతిక శాస్త్రం ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే 2026–27 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు నవోదయ వెబ్‌సైట్ www.navodaya.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం వట్టెం నవోదయ విద్యాలయం లేదా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు.. బీహార్‌లోని పాట్నా జిల్లా లోదిపూర్‌కు చెందిన సోనెలాల్ సింగ్ (25) నాలుగు నెలల క్రితం గద్వాల మండలంలోని అనంతాపురం సమీపంలో గల ఓ రైస్ మిల్లులో కూలీ పనినిమిత్తం వచ్చి మిత్రులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం స్వగ్రామానికి వెళ్తానని తోటి మిత్రులకు చెప్పి ఎర్రవల్లి కూడలికి వచ్చాడు. ఈ క్రమంలో రాత్రి పుల్లారెడ్డి పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహన ఢీకొట్టడంతో తీవ్ర రక్త గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అబులెన్స్‌లో గద్వాల మార్చురీకి తరలించారు. మృతుడి మిత్రుడు సుభాష్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

కారు బోల్తా: వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని వావిళ్లబావి గ్రామం వద్ద బుధవారం కారు బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం దేవరకద్ర మండలానికి చెందిన దుబ్బల శ్రీధర్, భూత్పూర్‌కు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, తుమ్మల రాఘవేందర్, దుబ్బల హరిప్రసాద్ కారులో దేవరకద్ర నుంచి సోమశిలకు బయలుదేరారు. మార్గమధ్యలో మండలంలోని వావిళ్లబావి గ్రామం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న నలుగురికి తీవ్రగాయాలు కాగా వారిని 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. దుబ్బల శ్రీధర్(23) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై వేధింపులు: వ్యక్తిపై కేసు నమోదు

నవాబుపేట: మహిళను వేధించిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట మండల కేంద్రానికి చెందిన వివాహిత జిల్లా కేంద్రంలో కూలీ పనికి వెళ్తున్న తరుణంలో టీడీ గుట్ట అడ్డాలో ఉన్న మేస్త్రీ సురేందర్ ఆమెపై లైంగిక వేధింపులకు దిగాడు. దీంతో మహిళ కూలికి వెళ్లటం మానేసింది. కాగా సురేందర్ బుధవారం మండల కేంద్రానికి వచ్చి సదరు వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉండగా ఆమెను చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా కారులో ఎక్కించుకుని జిల్లా కేంద్రం వైపు తీసుకెళ్లాడు. దీంతో ఆమె కేకలు వేయటంతో.. మండల కేంద్రం నుంచి యన్మన్ గండ్ల సమీపంలో ఆమెను వదిలేసి పరారయ్యాడు. అనంతరం బాధితురాలు తన భర్త మైబుతో కలిసి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేస్త్రీ సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


యాదయ్య(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో బుధవారం అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పొలంలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన సల్ల పెద్దయాదయ్య(50) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి వద్ద టిఫిన్ చేసి అచ్యుతారెడ్డి వ్యవసాయ పొలంలో కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ కరెంటు మోటారు సమీపంలో పొలం పనులు చేస్తూ మృతిచెందాడు. సాయంత్రం పొలానికి సమీపంలో గొర్రెలను మేపుతున్న కాపరి పొలంలో యాదయ్య మృతి చెంది ఉండడాన్ని గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. యాదయ్య కాలుకు కరెంట్ షాక్ తగిలినట్లు బొబ్బలు ఉండడంతో కరెంట్ షాక్‌తోనే మృతి చెంది ఉంటాడని తెలిపారు. కరెంటు మోటారు సమీపంలోని తీగలు తగిలి మృతిచెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మృతుడికి భార్య పెద్ద వెంకటమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. యాదయ్య కరెంటు షాక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు.

ఉల్లిధర గరిష్టంగా రూ.2 వేలు



దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. గత వారం వచ్చిన ధరలే ఈ వారం నమోదయ్యాయి. సీజన్ తగ్గడంతో మార్కెట్‌కు వచ్చిన వేయి బస్తాల ఉల్లిని కొనడానికి వ్యాపారులు పోటీ పడ్డారు. క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ.2 వేలు పలుకగా కనిష్టంగా రూ.1400 ధర వచ్చింది. 50 కేజీల ఉల్లి బస్తాను గరిష్ట ధర రూ.1000, కనిష్ట ధర రూ.700 వరకు విక్రయించారు. ఎక్కువగా చిరు వ్యాపారులు, వినియోగదారులు ఉల్లిని కొనుగోలు చేశారు.

అర్హులకు దక్కేనా..?


బోయలకుంటలో అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచూపులు

- జడ్చర్ల నియోజకవర్గంలో దాదాపు 2వేల ఇంటి నిర్మాణాలు పూర్తి
- నేటికీ కేటాయించని వైనం
- ఎర్రగుట్టలో మాత్రం యథేచ్ఛగా ఇళ్ల ఆక్రమణ

జడ్చర్ల: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కనీస మౌళిక వసతుల కల్పనతో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు జడ్చర్ల నియోజకవర్గంలో ఎక్కడా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదు. అసలు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇప్పటి వరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో కూడా స్పష్టత లేదు. దీంతో లబ్ధిదారుల ఎంపికలో అయోమయం చోటు చేసుకుంది.

2,700 ఇళ్లు మంజూరు

జడ్చర్ల నియోజకవర్గంలో దశల వారీగా ఇప్పటివరకు 2,700 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఎక్కువగా జడ్చర్ల మండలంలోనే 2132 ఇళ్లు నిర్మించారు. అయితే కావేరమ్మపేట, బండమీదిపల్లి, కోడ్గల్, తదితర గ్రామాల్లో మినహాయిస్తే ఎక్కడా డబుల్ బెడ్‌రూం ఇండ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదు. మిడ్జిల్, బాలానగర్, నవాబ్‌పేట, రాజాపూర్ మండలాల్లో సైతం డబుల్ బెడ్‌రూం ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.

దరఖాస్తుల వెల్లువ

డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరుకు సంబంధించి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఒక్క జడ్చర్ల పట్టణంలోనే దాదాపు 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. కానీ డిమాండ్‌కు సరిపడా గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించలేకపోయింది. పూర్తయిన ఇళ్లను సైతం అర్హులకు అందించలేదు. తాజాగా అర్హులను గుర్తించి ఇళ్లను కేటాయించడంలో అధికారులు ఎంతమేరకు పారదర్శకతను పాటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఐదేళ్లుగా అసంపూర్తిగానే..



బోయలకుంట కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. నిర్మాణపనులు చేపట్టి దాదాపు ఐదేళ్లయినా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నిర్మించలేదు. వెంటనే పనులు పూర్తి చేసి తమకు ఇళ్లు కేటాయించాలి.

– యాదయ్య, దరఖాస్తుదారుడు, బోయలకుంట

త్వరలో అర్హులను ఎంపిక చేస్తాం



ఎర్రగుట్టలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకున్నారు. వీరిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉంది. తమ దగ్గర ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని త్వరలోనే గుర్తించేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

తాజాగా తెరపైకి..

ఎర్రగుట్ట ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించుకున్న వారిని వెంటనే ఖాళీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశించడంతో తాజాగా వివాదం తెరపైకి వచ్చింది. బీఆర్‌ఎస్ నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇష్టానుసారంగా అమ్ముకున్నారని సాక్షాత్తు ఎమ్మెల్యే ఆరోపించడమేగాక సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి వారిని ఖాళీ చేయించాల్సిందిగా ఆదేశించారు. దీంతో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి తమ పార్టీ వారు ఎవరికి ఇళ్లను అమ్మలేదని.. ఒకవేళ అమ్మితే నిరూపించాలంటూ సవాల్ విసిరారు. అర్హులకు ఇళ్లను ఇవ్వాలని ఓ వైపు ఎమ్మెల్యే, మరో వైపు మాజీ ఎమ్మెల్యేలు పేర్కొంటున్నా ఖాళీ చేయించిన తర్వాత అవినీతి అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఏదేమైనా అధికారులు, పాలకులు స్పందించి అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎర్రగుట్టలో ఇళ్ల ఆక్రమణ

బాదేపల్లి ఎర్రగుట్ట ప్రాంతంలో దాదాపు 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చి ఇళ్లను ప్రారంభించారు. మొక్కుబడిగా ఆరుగురికి పట్టాలను అందజేశారు. తదుపరి అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అర్హులను ఎంపిక చేసేందుకు పట్టణంలో పర్యటించి క్షేత్రస్థాయిలో కసరత్తు చేశారు. కానీ అర్హుల జాబితాను రూపొందించేలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఇళ్ల కేటాయింపు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. తదుపరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎవరికి వారు ఇళ్లను ఆక్రమించుకుని నివాసం ఏర్పర్చుకున్నారు.


ఎర్రగుట్టలో ఆక్రమించుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

'ఫోన్ ట్యాపింగ్‌పై సిట్‌కు ఫిర్యాదు చేస్తా'

స్టేషన్ మహబూబ్‌నగర్: తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని, దీనిపై సిట్‌కు ఫిర్యాదు చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన దివంగత మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డితో ఫోన్‌లో సంభాషిస్తుంటే 2018లో తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ఆయన ఆరోపించారు. అప్పట్లో అందరి సమక్షంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తనను అవమానపరిచి మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాలు ఉండడం సహజమని, గత ప్రభుత్వం అవి మరిచి ఇతరులను ఇబ్బందులు పెట్టడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిని ప్రజలు తిరస్కరించాలని కోరారు. తన ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఆధారాలతో సిట్‌కకు ఫిర్యాదు చేస్తానని నర్సింహారెడ్డి తెలిపారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

జూరాలకు స్వల్పంగా తగ్గిన వరద


సుంకేసుల జలాశయం నుంచి దిగువకు పారుతున్న నీరు

- 14 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 1.28 లక్షల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం సాయంత్రానికి 1.22 లక్షలకు చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టు 14 క్రస్ట్‌గేట్లను పైకెత్తి 94,878 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 28,658 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 1,300, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 770, కుడి కాల్వకు 400, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.933 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో మూడు గేట్లు ఎత్తి..

దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లను పైకెత్తి 80,646 క్యూసెక్కుల నీటిని బుధవారం దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 1,81,051 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. 882.4 అడుగుల నీటిమట్టం, 201.1205 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,978 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 19,166 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,266 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.657 మి.యూ., ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 17.478 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసుల జలాశయంలో..

రాజోళి: సుంకేసుల జలాశయం 15 గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 55 వేల వరద రాగా.. దిగువకు 57,515 క్యూసెక్కులు వదిలినట్లు చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 0.608 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 23 అడుగులు..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయంలో బుధవారం సాయంత్రం 23 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో 3.6 అడుగుల నీరు చేరితే పాత అలుగుస్థాయి 26.6 అడుగులకు.. మరో 9.6 అడుగుల నీరు చేరితే పూర్తిగా నిండుతుందన్నారు.

ఆలయాల్లో చోరీ

మక్తల్: ఆలయాల్లో విగ్రహాలను, నగదును బుధవారం రాత్రి 3 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన మక్తల్ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలో జంబులమ్మ దేవాలయంలో 5 కేజీల అమ్మవారి ఉత్సహం, 6 వేల నగదు, నగరేశ్వర ఆలయంలో 10 వేలు, దొంగుల ఆంజనేయస్వామి దేవాలయంలో వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్లిన భక్తులు చెల్లాచెదురైన వస్తువులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి సమయంలో దొంగతనాలు అధికంగా జరుగుతుండంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఇంటి తాళం విరగొట్టి బంగారు, వెండి చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం విరగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన మండలంలోని వనపట్లలో మంగళవారం చోటుచేసుకోగా.. బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వనపట్లకు చెందిన రేణుక మంగళవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 6తులాల బంగారు నగలు, 20తులాల వెండి గొలుసును ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన రేణుక ఇంటి తాళం విరగొట్టి ఉండటంతో పాటు బీరువాలో బట్టలు, వస్తువులు చిందర వందర ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం వివరాలు సేకరించారు. బుధవారం బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిపై కత్తితో దాడి



గద్వాల క్రైం: ఇంటర్ విద్యార్థిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం పట్టణంలో కలకలం రేపింది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల పట్టణంలోని గంజిపేట కాలనీకి చెందిన రవితేజ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో అంబేడ్కర్ కాలనీకి చెందిన గుర్తు తెలియని యువకులతో కొన్ని రోజులు క్రితం రవితేజకు వివాదం జరిగింది. అయితే పాత కక్షలు మనసులో పెట్టుకొని కొందరు యువకులు బుధవారం పట్టణంలోని కోట సమీపంలో విద్యార్థితో ఘర్షణ పడి ఎడమ వైపు చాతీలో కత్తితో పొడిచారు. పక్కనే ఉన్న చరణ్‌తేజ గొడవను అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా అతడికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవితేజ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. ఓ యువతితో ప్రేమ వ్యవహారమే దాడికి గల కారణాలు అయి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు.

పుస్తకాలు సమాజానికి దిక్సూచి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పుస్తకాలు సమాజానికి దిక్సూచిగా ఉండాలని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రచించిన 'ట్రెన్ ట్రాన్స్‌ఫార్మ్ ట్రాయాంఫ్ అండ్ స్పోర్ట్స్ న్యూట్రీషియన్, వెయిట్ మేనేజ్‌మెంట్' అనే పుస్తకాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం వేగంగా మార్పుచెందుతోందని, మార్పులను వివరంగా పాఠకులకు అందించేందుకు రచయితలు ఎప్పుడు సిద్ధంగా ఉండాలని, వారు పరిశోధన రంగాల్లో మార్గదర్శకులుగా నిలవాలన్నారు. పుస్తకాలు ఒక్క యూనివర్సిటీకే కాకుండా యావత్ సమాజాన్నే ప్రభావితం చేసే విధంగా ఉంటాయన్నారు. ఈ పుస్తకం బీపెడ్, ఎంపెడ్ చేసే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, పీడీ సత్యభాస్కర్, భూమయ్య, అర్జున్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, /జ్ఞానేశ్వర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ఆరోపణలు అర్థరహితం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి ఎత్తిపోత పథకం (కేఎల్‌ఐ) కాల్వ పనులపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థ రహితమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కేఎల్‌ఐపై చిత్తశుద్ధి ఉండటంతోనే మోటార్లు ప్రారంభించామని చెప్పారు. ప్రజాప్రతినిధిగా ఓడిన తర్వాత టూరిస్టుగా వచ్చిపోతున్న వారికి కేఎల్‌ఐపై సరైన అవగాహన లేకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. డి–63, 64 కాల్వ పనుల్లో కొన్ని మరమ్మతులు ఉన్నాయని.. వాటిని సరిచేస్తూ నియోజకవర్గంలోని మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కల్వకుర్తి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక నిధులు కేటాయిస్తున్నారని వివరించారు.

11న మంత్రుల పర్యటన..

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.189 కోట్లు కేటాయించిందని.. పట్టణంలో నూతనంగా నిర్మించే 100 పడకల ఆస్పత్రి, వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అనంతరం పట్టణంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. సమావేశంలో నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మోతీలాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, భూపతిరెడ్డి, రాజేష్‌రెడ్డి, నర్సింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలతో సత్ఫలితాలు

మహమ్మదాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణాలు సత్ఫలితాలిస్తున్నాయని కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. బుధవారం మండలంలోని నంచర్ల, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, ధర్మాపూర్, మహమ్మదాబాద్‌లో కేంద్ర బృందం జలశక్తి జలభాగ్యధారి అధికారి సైంటిస్టు సందీప్‌కుమార్ ఇంకుడు గుంతల నిర్మాణాలు వాటి వినియోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గుంతల వినియోగం ఎలా ఉన్నదని, భూగర్భజలాలు పెరిగే అవకాశమున్నదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకుడుగుంతల నిర్మాణాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని వినియోగించిన నీరు వృథా కాకుండా తిరిగి భూమిలోకి ఇంకిపోతున్నందున భూగర్భజలాలు పెరిగే అవకాశమున్నదని ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కేంద్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగమవుతున్నట్టు తెలిపారు. ఈయన వెంట ఈఎస్‌సీ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఏపీఓ హరిశ్చంద్రుడు, టీఏలు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


గాధిర్యాల్‌లో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

మన్యంకొండ హుండీ ఆదాయం రూ.41.65 లక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మన్యంకొండలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి హుండీని బుధవారం లెక్కించారు. మార్చి 22వ తేదీ నుంచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ. 41,65,385 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్, ఈఓ శ్రీనివాసరాజు, ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునతో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


మన్యంకొండలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు

చిన్నారుల వసతులపై జడ్జి ఆరా

పాలమూరు: జిల్లా కేంద్రంలో ఉన్న షెల్టర్ హోం ఫర్ బాయ్స్, చిల్డ్రన్ హోంను బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. స్థానికంగా చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, ఇతర వసతులపై ఆరా తీశారు. అన్ని సదుపాయాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు.


చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.ఇందిర